క్లుప్తంగా

పదోతరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

పీలేరురూరల్ : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ డీఎం బి.కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు హాల్ టికెట్ చూపించి బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చునని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల నియమావళి మేరకు ప్రకటనలు తొలగింపు



కలకడలో బ్యానర్లు తొలగిస్తున్న అధికారులు

కలకడ : ఎన్నికల నియమావళి మేరకు ఆదివారం ప్రకటనలు, బ్యానర్ల తొలగింపు కార్యక్రమాన్ని రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాయంత్రం 3 గంటలలోపు ప్రకటనలు, బ్యానర్లు, రాజకీయ నాయకుల ఫొటోలు వంటివాటిని పూర్తిగా తొలగించాలని ఆదేశాలు అందినట్లు తహసీల్దార్ ప్రియదర్శిని, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. అనుమతి లేకుండా ప్రకటనలు చేసినా, సౌండ్ బాక్స్‌లు, డీజెలు ఏర్పాటు చేసిన కేసులు నమోదు తప్పదని ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి హెచ్చరించారు.

ఏపీపీగా నాగమల్‌రెడ్డి



తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుండ్లపల్లె పంచాయితీ వేమారెడ్డిగారిపల్లెకు చెందిన న్యాయవాది నాగమల్‌రెడ్డి నియమితులయ్యారు. కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఇతను బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పనిచేసి జిల్లా స్థాయి న్యాయమూర్తుల వద్ద ప్రశంసలు అందుకున్నారు.

రైటింగ్ ప్యాడ్స్ వితరణ



ప్యాడ్స్ వితరణ చేస్తున్న బంజారా సంఘం నాయకులు

పీలేరు : స్థానిక ట్రైబల్ బాలికల గురుకుల పాఠశాలలో పది తరగతి చదువుతున్న విద్యార్థులకు బంజారా సేవా సంఘం నాయకులు ప్యాడ్స్, పెన్నులు, స్కేల్, పెన్సిల్లు వితరణ చేశారు. ఆదివారం పాఠశాలలో బంజారా సంఘం నాయకులు బి. హరినాయక్, చంద్రశేఖర్‌నాయక్, రామ్మూర్తినాయక్, నాగేశ్వర్‌నాయక్, అనిల్ నాయక్, రవినాయక్ విద్యా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మదనపల్లె సిటీ : పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మదనపల్లె లో 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివారం పరీక్షా కేంద్రాల్లో బెంచీలపై నంబర్లు, గదుల కేటాయింపు కార్యక్రమాలు పూర్తి చేశారు. విద్యార్థులు సులభంగా గదులు తెలుసుకునేలా చర్యలు చేపట్టారు. ఆయా పాఠశాలల ప్రధాన ద్వారం ఎదుట నోటీసు బోర్డులో విద్యార్థుల హాల్‌టిక్కెట్ల నంబర్లు, గదుల నంబర్లు పెట్టారు. విద్యార్థుల కోసం మంచి నీటి సదుపాయంతో పాటు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డిప్యూటీఈఓ శ్రీరాం పురుషోత్తం, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు.

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్ కేంద్రంగా సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కందుకూరు, కమ్మచెరువు, పీటీఎం తెలుగు, ఉర్దూ, కస్తూర్బా, మోడల్ స్కూళ్లలో చదివిన 243 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

కలకడ : పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్ తెలిపారు. మండలంలో మూడు ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలుగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. కె.బాటవారిపల్లె ఉన్నతపాఠశాల (తెలుగు)లో 260 మంది , ఆదర్శపాఠశాల కలకడ లో 268 మంది, కోన జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 82 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

గంగమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

లక్కిరెడ్డిపల్లె : భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆదివారం గంగమ్మ దేవత ఆలయ ప్రాంగణం జాతరను తలపించింది. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. గంగమ్మతల్లి సేవా సమితి ఆధ్వర్యంలో తెల్లవారుజామున గంగమ్మ ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని పూజారులు కల్పించారు. లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ్ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లు తన సిబ్బందితో కలిసి ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేక అధికారి రవీందర్ రాజు, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

విద్యార్థులు.. విజయీభవ

- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- పరీక్షలకు సిద్ధమంటున్న విద్యార్థులు
- ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఉపాధ్యాయులు



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

పాఠశాల పేరు	విద్యార్థుల సంఖ్య
జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, వాల్మీకిపురం	76
పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వాల్మీకిపురం	115
ఉర్దూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వాల్మీకిపురం	30
డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, వాల్మీకిపురం	76
ఏపీఆర్ మైనార్టీ గురుకుల పాఠశాల, వాల్మీకిపురం	47
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చింతపర్తి	91
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గండబోయనపల్లి	34
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తమంచూరు	29

వాల్మీకిపురం : విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రమిస్తున్నారు. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పోటాపోటీగా విద్యార్థులను సమాయత్తం చేస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

గతేడాది 71శాతం ఉత్తీర్ణత :

ఈ పదేళ్ల చదువంతా ఒక ఎత్తయితే పదో తరగతి పరీక్షలు మరో ఎత్తు. సోమవారం (మార్చి 18)నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పరీక్షలు ముందుకు వస్తుంటే విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. ఆ ఒత్తిడి నుంచి విద్యార్థులను బయటపడేసి మంచి ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులు మంచి శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలన్నదే ధ్యేయంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గతేడాది మండల వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో 71శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ సారి వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలోని 8 ఉన్నత పాఠశాలల్లోని దాదాపు 498 మంది మొత్తం విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఎలాగైనా ఎక్కువ మార్కులు సాధించాలని పట్టుదలతో కృషి చేస్తున్నారు. సంవత్సరమంతా ఎంత చదివినా పబ్లిక్ పరీక్షల్లో వచ్చే గ్రేడ్ గీటురాయి.

ప్రత్యేక తరగతులు

ఉత్తమ గ్రేడ్‌లు సాధించడానికి అనుగుణంగా పాఠశాలల్లో ఉదయం 8:00 గంటల నుంచి 9:00గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత పరీక్షల్లో (ఎఫ్ఏ1, ఎఫ్ఏ2, ఎఫ్ఏ3, ఎఫ్ఏ4, ఎస్ఏ1) వచ్చిన మార్కుల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లుగా విభజించి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

పరీక్షల షెడ్యూలు ఖరార్

ఈ నెల 18 నుంచి 27వ తేది వరకు పదవ తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 18న తెలుగు, 19న హిందీ, 20న ఇంగ్లీష్, 22న మ్యాథమెటిక్స్, 23న ఫిజిక్స్, 26న బయాలజీ, 27న సోషియల్ పరీక్షలు జరగనున్నాయి.

సందేహాల నివృత్తి



తరగతి గదిలో వచ్చిన సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసుకుంటున్నాం. ఉపాధ్యాయులు ప్రతి విషయాన్ని ఓపికగా వివరిస్తున్నారు. ఒకటికి రెండుసార్లు చెప్పినా అర్థంకాకపోతే కూర్చోబెట్టి అర్థమయ్యే దాకా చెబుతున్నారు. కష్టంగా ఉండే భౌతిక, రసాయన, జీవ, గణిత శాస్త్రాలను సులువుగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు.
– జయంతి, పదో తరగతి విద్యార్థిని, వాల్మీకిపురం.

ప్రత్యేక తరగతులు



చదువుల్లో వెనుకబడిన వారికి, సబ్జెక్టు సరిగ్గా అర్థంకాని వారికి ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఆయా విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవచ్చు. స్టడీ అవర్స్ ఉపయోగకరం. అందరం హాజరవుతున్నాం.
– ప్రీతిక రెడ్డి, పదో తరగతి విద్యార్థిని, వాల్మీకిపురం

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వందశాతం ఫలితాలే లక్ష్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ఫలితాలను పరిశీలిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి.
– శ్రీదేవి, హెచ్‌ఎం, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, వాల్మీకిపురం

అభివృద్ధిని చూసి ఆదరించండి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఓటర్లను అభ్యర్థిస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఆదరించాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని కాలువపల్లి, పెద్దపల్లి, బుద్దలవారిపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలు అడుగడుగునా ఆయనకు ఘనంగా స్వాగతిస్తూ హారతులు పట్టారు. గడప, గడపకూ వెళ్ళి జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, అర్హులకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కరువుకు మారు పేరుగా ముద్రపడి, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తంబళ్ళపల్లి నియోజక వర్గాన్ని తాను ఎమ్మెల్యే అయ్యాకా అన్ని విధాలుగా అభివృద్ధి చేసానని పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు పాలనకు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు తేడా గమనించాలని ప్రజలకు సూచించారు. అంతేగాక శిథిలావస్థకు చేరుకున్న పురాతన కాలం నాటి ఆలయాలను సైతం అభివృద్ధి చేసి వాటికి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేసినట్లు తెలిపారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో పాటు తనను ప్రజలంతా నిండు మనస్సుతో మళ్ళీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఎంపీపీ సాయి లీలా, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గౌరీశంకర్‌రెడ్డి, సర్పంచ్ మహబూబ్‌బాషా ఎంపీటీసీ మల్లికార్జున, నాయకులు మధుసూధన్ రెడ్డి, చంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో ఐవీఆర్‌ఎస్ రగడ

- శంకర్ పేరుతో సర్వేపై
- అది నకిలీ సర్వే అని అభ్యర్థి వర్గీయుల ఆగ్రహం

బి.కొత్తకోట: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ పేరుతో శనివారం టీడీపీ నిర్వహించిన ఐవీఆర్‌ఎస్ సర్వేపై టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి వర్గీయులు భగ్గుమంటున్నారు. 2014 ఎన్నికల్లో మీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మీరు ఎవరిని కోరుకుంటున్నారు అని చంద్రబాబు వాయిస్‌తో, తర్వాత శంకర్‌యాదవ్ అయితే ఒకటి నొక్కండి, నోటా అయితే రెండు నొక్కండి అని ఫోన్లకు వాయిస్ కాల్స్ వచ్చాయి. దీనితో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీలో రగడ నెలకొంది. ఇప్పటికే జయచంద్రారెడ్డికి అభ్యర్థిత్వం ఖరారైందని, మళ్లీ అభ్యర్థి ఎంపిక ఉండదని ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది నకిలీ ఐవీఆర్‌ఎస్ అని, నిజం కాదని చెబుతూ వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు ఫార్వార్డ్ చేసుకుంటున్నారు. శంకర్ పేరుతో వచ్చిన సర్వే నకిలీ అయితే జయచంద్రారెడ్డి పేరుతో వచ్చిన ఐవీఆర్‌ఎస్ సర్వే కూడా నకిలీనేనా అని శంకర్ వర్గీయులు వాదిస్తున్నారు. దీనిపై ఆదివారం శంకర్ వర్గీయులు బి.కొత్తకోటలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై టికెట్ శంకర్‌కే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సర్వే వివాదంతో టీడీపీలో రగడ జరుగుతోంది. ఇలా ఉండగా ఇటీవల అభ్యర్థి జయచంద్రారెడ్డి పేరుతో నియోజకవర్గంలో పార్టీ ప్రచారం సాగుతోందా లేదా అని సర్వే ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలోనూ జయచంద్రారెడ్డికి అధికశాతం వ్యతిరేకంగా సమాధానం వచ్చిందని శంకర్ వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. దీనితో రెండు వర్గాలు టికెట్ తమకే అని గట్టిగా ప్రచారం చేసుకుంటున్నాయి.

హ్యాట్రిక్ విజయం అందించాలి



ఎన్నికల ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు హ్యాట్రిక్ విజయం అందించాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలోని ఎస్‌కేడీనగర్. ఆర్టీసీ నల్లగుట్ట, పద్మావతి నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత ఐదు సంవత్సరాల్లో పీలేరులో జరిగిన అభివృద్ధి గూర్చి ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించడంతోపాటు రాష్ట్రానికి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోరాదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జీనత్ షఫీ, ఎంపీటీసీ సైషావలి, నాయకులు ఎస్.వి. చలపతి, స్టాంపుల మస్తాన్, బారేషా, నాగరాజమ్మ, లక్ష్మీదేవి, కడప గిరిధర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, హుమయూన్, ఆనంద్, ఉదయ్, చక్రధర్, భాస్కర్‌రెడ్డి, భాగ్యలక్ష్మీ, సపూరా, రాజేశ్వరి, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కర్ణాటక మద్యం అమ్మకాలు

పెద్దతిప్పసముద్రం : మండలానికి కూతవేటు దూరంలోనే కర్ణాటక సరిహద్దు ఉంది. దీంతో మండలంలో ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం ఏరులై పారుతుండటంతో విక్రయాలు కూడా అదే తరహాలో ఊపందుకుంటున్నాయి. మండలంలో చెక్‌పోస్టులు ఉన్నా కూడా రాచమార్గంలోనే పలువురు మద్యం ప్యాకెట్లను అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు చెక్‌పోస్టుల మీదుగా కాకుండా దొడ్డిదారుల్లో సంచుల్లో నింపుకుని కాలినడకన దిగుమతి చేస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మరికొంత మంది అయితే సార్వత్రిక ఎన్నికల సమయం ముంచుకొస్తున్న తరుణంలో మద్యంకు గిరాకీ అధికంగా ఉంటుందని భావించి ముందస్తుగా గుట్టుగా ఉన్న స్థలాల్లో నిల్వ చేసుకునేలా పక్కా ప్లాన్‌ను అమలు చేస్తున్నారని సమాచారం. కార్లలో మద్యం రవాణా చేసే బడా వ్యాపారస్థులకు ఎస్‌ఈబీలో పని చేసే పలువురు ఖాకీల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే అక్రమ వ్యాపారం దర్జాగా సాగుతోందని ప్రజల్లో విమర్శలు వస్తున్నాయి. ఎస్‌ఈబీ పోలీసులు నామమాత్రంగా దాడులు నిర్వహించి అమాయకులపై కేసు నమోదు చేస్తూ బడా వ్యాపారులను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ప్రజల్లో గుప్పుమంటున్నాయి. సివిల్ పోలీసులైతే నెలకు పదుల్లోనే లిక్కర్ కేసులు నమోదు చేస్తున్నా ఎస్‌ఈబీ అధికారులు ఇంతకు మించి లిక్కర్ కేసులు ఎందుకు నమోదు చేయలేదనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఎస్‌ఈబీ అధికారులు మద్యం అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా వేసి అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైఎస్సార్ సీపీలో చేరిన కోళ్లబైలు టీడీపీ యూత్



వైఎస్సార్ సీపీలో చేరిన యువతతో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు పంచాయతీకి చెందిన టీడీపీ యూత్ ఆదివారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. సొసైటీకాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిసార్‌అహ్మద్ యువకులకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి ఆకర్షితులై యువత పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి నాయకత్వంలో, జగనన్నతో నడవాలని నిర్ణయించుకుని యువత నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. రానున్నది జగనన్న ప్రభుత్వమేనని, రోజు రోజుకీ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఆదరణ పెరిగి, పార్టీలో చేరేందుకు పలువురు ముందుకు వస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, వారి సేవలను వినియోగించుకుంటామన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీలు ఒక్కటై ఎన్నికల బరిలోకి దిగడం, వైఎస్సార్ సీపీలో విద్యావంతుడు, వివాదరహితుడైన నిసార్‌అహ్మద్‌కు సీటు కేటాయించడం, ఎంపీ మిథున్‌రెడ్డి యువతకు ప్రాధాన్యత ఇవ్వడం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలో చేరామన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపుకు శాయశక్తులా కృషిచేస్తామన్నారు. వైఎస్సార్ సీపీలో చేరినవారిలో రాజు, దినేష్, మనోహర్, రెడ్డికుమార్, కిట్ట, వంశీ, గణేష్, గంగాసాగర్, కే.రెడ్డికుమార్, మహేంద్ర, హరినాథ్, యశ్వంత్, శశిమోహన్, లోకేశ్వర్, మహేష్‌రెడ్డి, పవన్, సాయిభార్గవ్, శశికుమార్, గురు, గని, మధు తదితరులు ఉన్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు



వాల్మీకిపురంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

వాల్మీకిపురం : ఎన్నికల సందర్భంగా వాల్మీకిపురం మండలంలో ఆదివారం కేంద్ర బలగాలతో కలసి డీఎస్పీ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలోని చింతపర్తి, వాల్మీకిపురం పురవీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో నిర్భయంగా ఓటేయడానికి ఓటర్లకు భరోసా కల్పించడానికి ఈ ప్రదర్శన నిర్వహించినట్లు సీఐ పులిశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమెండర్ కేషర్‌లాల్ మీనా, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

చీకలగుట్టలో కార్డెన్‌సెర్చ్

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చీకలగుట్ట శివాజీనగర్ ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం కార్డెన్‌సెర్చ్ నిర్వహించినట్లు సీఐ యువరాజు తెలిపారు. కేంద్ర ఎస్ఎస్‌బీ బలగాలు, పోలీస్‌సిబ్బందితో కలిసి సంయుక్తంగా నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో పాత నేరస్థుల ఇళ్లపై నిఘా ఉంచి, తనిఖీలు చేస్తుండగా, ఒక వ్యక్తి నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు. శాంతియుత వాతావరణం, ప్రశాంత పోలింగ్ లక్ష్యంగా ప్రజలకు ధైర్యం చెప్పేందుకు కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే, వారికి చట్టపరమైన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్డెన్‌సెర్చ్‌లో టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖాదర్‌వలీ



ఖాదర్‌వలీకి నియామకపత్రం అందిస్తున్న దృశ్యం

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మదనపల్లెకు చెందిన ఖాదర్‌వలీ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్‌బాజీ పంపిన నియామకపత్రాన్ని ఆదివారం సొసైటీకాలనీ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ చేతుల మీదుగా అందుకున్నారు. నూర్‌బాషా, దూదేకుల సంక్షేమానికి అభ్యున్నతికి కృషి చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, మైనారిటీ నాయకులు ముబషీర్, లియాఖత్‌అలీ, సాదిక్, నూర్, కోటూరి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పరిశీలనలో సచివాయలయాన్ని తనిఖీ చేస్తున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : ఎన్నికలను పారదర్శకంగా, న్యాయబద్ధంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పరిశీలనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలిసి పట్టణంలోని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్‌కమిటీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నియమావళి ప్రకారం నియోజకవర్గంలోని ప్రభుత్వ భవనాల్లో ఉండే రాజకీయ పార్టీల ప్రతినిధుల పోస్టర్ల తొలగింపు 24 గంటల్లోగా, బహిరంగ ప్రదేశాల్లో 48 గంటల్లో, ప్రైవేట్ ప్రదేశాల్లోని పోస్టర్లు, పార్టీల జెండాలు 72 గంటల్లో తొలగిస్తామన్నారు. కోడ్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఫిర్యాదులు, సందేహాలను తీర్చుకునేందుకు సబ్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని, టోల్‌ఫ్రీ నెంబర్ 1950తో పాటుగా 18005990666 నంబర్లకు ఎవరైనా కాల్‌చేయవచ్చని సూచించారు. పోటీచేసే అభ్యర్థులు ఎవరైనా రాజకీయ ప్రచార ప్రకటనల కోసం ముందస్తుగా సబ్ కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ విభాగం నుంచి అనుమతి పొందాలని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా పంపిణీ చేసే వస్తువులు లేదా సామగ్రిని ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా సీజ్‌చేస్తామని ప్రకటించారు. సీ-విజిల్ యాప్ ద్వారా కూడా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వో నాగేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.